# నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి ?

"నువ్వు నోరు మూసుకో అమ్మా! నీకేం తెలుసని!-" అని భూపతిరావు తల్లిని గద్దించాడు.

సుగుణ వెంటనే మాట్లాడడం మానేసింది. నోరు మూసుకుంది.

ఆమె తండ్రి ఇట్లాగే "నువ్వు నోరు మూసుకో!" అనేవాడు. "నువ్వు నోరుమూసుకోవే!' ' అనేవాడు ఆమె భర్త కూడా. అదేమాట ఇప్పుడు కొడుకంటున్నాడు.

"నోరు మూసుకోవడం తన కలవాటే!" అనుకుంది సుగుణ.

ఆమెకేం కావాలో ఆమెకేది ఇష్టమో ఆమె అభిప్రాయమేమిటో ఆమెకే తెలియకుండా పోయింది. ఆమె పెంపకమే ఆ విధంగా జరిగింది. ఆమె తండ్రి ఆమెనలాగే పెంచాడు. అతని ఠీవికి వంశ గౌరవానికి లోటు రాకుండా ఆమెను పెంచాడు. సుగుణ నోరెత్తినా అడుగేసినా వంశ గౌరవానికి భంగం కలుగుతుందన్నట్లుగానే ఆమె తండ్రి రాఘవరావు కోప్పడేవాడు.

"ఆడపిల్లవు ఏమిటా అరుపులు! ఏమిటా గెంతడాలు!" అని కళ్ళెఱ్ఱ చేసేవాడు.

రాఘవరావు కూతురుతో ఎప్పుడూ ప్రేమగా లాలనగా మాట్లాడేవాడు కాదు. ఆయన ఇంట్లో వుండడమే తక్కువ. పొలం పనులు కోర్టు వ్యవహారాలని తిరుగుతుండేవాడు. ఒక తండ్రిగా ఎన్నడూ ఆయన తన పిల్లలను లాలించలేదు. గారాబం చేయలేదు. అందులో ఆడపిల్ల సుగుణను చూస్తేనే రాఘవరావు ఏదో ఒక నెపం మీద కోప్పడేవాడు. దాంతో సుగుణకు తండ్రి అంటే భయమే ఏర్పడింది. ఆయనతో ఆమె ఎప్పుడు మాట్లాడలేదు. ఆయన ముందు కళ్ళెత్తి చక్కగా చూడడానికే ఆమెకు చచ్చేంత భయం. ఆయన వుండగా ఇంకా ఎవరితోనైనా మాట్లాడడానిక్కూడా ఆమెకు భయమే!

రాఘవరావు పెద్ద భూస్వామి. పది ఊళ్ళల్లో మంచి పేరున్నవాడు. చుట్టుపక్కల

ఎవరికి ఏ పంచాయితి వచ్చినా అతడే పెద్ద. అతడే న్యాయం చెప్పేవాడు. ఆయనకు మొదటి సంతానం సుగుణ. తొల్తనే కూతురు పుట్టిందని రాఘవరావు నిరాశపడ్డాడు. ఆ నిరాశ అతనిలో కోపంగా మారింది.

"మొదటి సంతానం ఆడపిల్ల పుట్టడం మా వంశంలోనే లేదు ఏడుతరాల నుంచి. ఇదంతా మీ వంశంలోదే" అని భార్యను ఎత్తిపొడిచాడు రాఘవరావు సమయం వచ్చినప్పుడల్లా.

సుగుణ తర్వాత రాఘవరావుకు కొడుకు పుట్టాడు. రెండోసారి గర్భవతిగా వున్నప్పుడు అతని భార్య సరస్వతి చాలా భయపడింది. "ఈసారి కొడుకు పుట్టకపోతె అమ్మో! ఏమైన వుందా?" అనుకొని బిగుసుకపోయేది. అదృష్టవశాత్తు కొడుకు పుట్టాడు. రెండో సంతానం మగపిల్లాడు అయినందుకు వంశగౌరవం నిలబడ్డట్లుగా సంతోషించాడు రాఘవరావు.

సరస్వతి ఆ తర్వాత వరుసగా ఐదుగురు కొడుకులనే కన్నది. ఆరుగురు మగపిల్లల్లో సుగుణ ఒక్కతె ఆడపిల్ల. అయినా ఆమెకేం లాలన పాలన తండ్రి దగ్గరి నుంచి దొరకలేదు.

సుగుణను పట్నంలో హాస్టల్లో వేసి పై చదువు చదివించాలని సరస్వతి పట్టుబట్టింది. ఊళ్ళో హైస్కూలు చదువు తర్వాత కూతురికి పై చదువు చెప్పించాలని ఆమె ఆశపడింది.

కాని రాఘవరావు ససేమిరా ఒప్పుకోలేదు.

"ఆడపిల్లను హాస్టల్లో పెట్టి చదివించడమేమిటి! నీకేమైన బుద్ధి వుందా? దానికేమైన అయితె! అయినా ఆడపిల్లకు పెళ్ళి చేయాలని ఏ తల్లయినా కోరుకుంటుంది కాని ఇట్లా చదువు లేమిటి?" అని రాఘవరావు సుగుణకు సంబంధాలు చూడడం మొదలు పెట్టాడు.

సుగుణ ఎక్కువ బయటి ప్రపంచాన్ని ఎరుగదు. ఆమె ఊర్లో స్కూలుకు వెళ్ళినా స్కూలు నుంచి వచ్చింతర్వాత ఇల్లే! ఏ రోజైనా కాస్త బయటికి వచ్చి బయటి గదిలో నిలబడ్డా రాఘవరావు "ఇక్కడేం పనే నీకు లోపలికెళ్ళు!" అనే కసిరేవాడు.

సుగుణను చూస్తేనే రాఘవరావుకు బుగులు. "దీనికి పెళ్ళి చేసి అత్తారింటికి పంపిస్తే గాని నాకు నెమ్మదిగా వుండదు!" అని అనుకునేవాడు. అందుకే రాఘవరావు సుగుణకు పదోక్లాసు పరీక్షలు కాగానే పదహారేళ్ళకే పెళ్ళి చేసాడు. అల్లుడు పట్నంలో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు.

సుగుణ భర్త మోహనరావు కుటుంబమంతా అంటే తల్లీ తండ్రి చెల్లెళ్ళు అక్కలు అన్నలు తమ్ముళ్ళు ఊర్లోనే వుంటారు. ఆయనొక్కడే భార్యతో పట్నంలో కాపురం పెట్టాడు. కొత్తగా కాపురం పెట్టినప్పుడు కొన్నాళ్ళు సుగుణ తల్లి కొన్నాళ్ళు మోహనరావు తల్లి సుగుణకు తోడుగా వున్నారు. కాని వాళ్ళు మాత్రం వాళ్ళ బాధ్యతలు విడిచిపెట్టి చాన్నాళ్ళు వుండడం వీలుకాలేదు. చివరకు సుగుణ మోహనరావులు మాత్రమే మిగిలారు.

సుగుణ ఇంట్లో తల్లితో చేరి వంటవార్పు, ఇంటిపనులు, కుట్లు అల్లికలు బాగానే నేర్చుకుంది. ఇంట్లో సుగుణకు ఆ పనులతోనే పొద్దుపోయేది. కాని సుగుణకు ఇంట్లోంచి బయటికి వెళ్ళాలంటే భయం. ఒంటరిగా ఆమె ఎక్కడికి వెళ్ళలేదు. భర్త ఉద్యోగానికి వెళ్తే దినమంతా ఆమె ఒంటరిగా వుండాలి. చుట్టూ పెద్ద పెద్ద బంగళాలు. ఏ ఇంట్లో ఎవరుంటారో కూడా తెలియదు. ఇక ఇరుగు పొరుగుతో కలిసి మాట్లాడే అవకాశమున్నట్లుగా ఆమెకు అనిపించలేదు. అందుకని సుగుణ రక్షణ కోసమని మోహనరావు ఇంటికి బయట నుంచి తాళం వేసుకొని ఆఫీసుకు వెళ్ళిపోయేవాడు. తిరిగి సాయంత్రం అతడు వచ్చి తాళం తీసేవాడు. అట్లా సుగుణకు ఇంట్లోనే వుండడం అలవాటయింది. ఎవరితో మాట్లాడాలన్నా కలవాలన్నా ఆమెకు జంకుగా వుంటుంది. ఒకసారి మోహనరావు ఆఫీసువాళ్ళ బలవంతం మీద సుగుణను ఆఫీసు ఫంక్షన్‌కు తీసుకెళ్లాడు. అటువంటివేవి అలవాటులేని సుగుణ నీళ్ళ బయటపడ్డ చేపలా గిలగిలలాడింది. మళ్ళా ఇంట్లో పడ్డాకనే ఆమెకు మనశ్శాంతి కలిగినట్లనిపించింది.

"మరీ! ఇంత ఎడ్డిమొఖమైతె ఎట్లా?" అని సుగుణ తనకుతానే తిట్టుకుంది. కాని ఆ తర్వాత భర్త ఆమెనెక్కడికీ తీసుకెళ్ళలేదు.

సుగుణ కాపురానికి వచ్చేటప్పుడు తండ్రి రాఘవరావు ఆమెకు కఠినమైన సంసార నియమాలన్నీ చెప్పాడు.

"రెండు కుటుంబాల గౌరవం మంట కలపకుండా నడుచుకో! జాగ్రత్త!" అన్నాడు చివరిమాటగా.

అందుకే సుగుణ ఏది చేయబోయినా తండ్రి మాటలు చెవుల్లో గింగురుమనేయి. దాంతో ఆమెకు కాళ్ళూ చేతులు ఆడేయి కావు.

సుగుణ వండిపెడ్తె తినడం ఆమె అడిగిన సామాన్లు తేవడం చేసేవాడు మోహనరావు. కొన్ని సామాన్లు లేకపోతే తేలేదేమని సుగుణ అడిగితే "అన్నీ తెచ్చాను! సరిగ్గా చూసుకో! లేనిపోని సామాన్లన్నీ రాసిస్తావు!" అని కసురుకునేవాడు. దాంతో భర్త తెచ్చిపడేసిన సామానుతో మారు మాట్లాడకుండ సర్దుకోవడం నేర్చుకుంది సుగుణ.

మోహనరావు భార్య వంటింట్లో వండి పెట్టడానికి పడకటింట్లో సుఖాన్నియ్యడానికి మాత్రమే వుందనుకునేవాడు. అంతకు మించి భార్యతో అతనికి ఏ అనుబంధమూ వుండేది కాదు. స్నేహితులు బంధువుల గురించి గాని తన ఆఫీసు విషయాలు గాని బయటి ప్రపంచంలో ఏం జరుగుతుందో గాని మోహనరావు సుగుణతో మాట్లాడేవాడు కాదు. "అవేవి ఆమె కర్థంకావు" అనుకునేవాడు. ఆమెకవేవి చెప్పవలసిన అవసరమే అతనికి మనస్సులో కలుగలేదు. దాంతో వాళ్ళిద్దరి మధ్య మాట్లాడుకోవలసిన విషయాలే లేవన్న పరిస్థితి ఏర్పడింది. ఒక్కరోజులో వాళ్ళిద్దరు మాట్లాడుకునే పదాలు వాక్యాలు వేళ్ళమీద లెక్క పెట్టదగినంతలోనే

వుండేయి. ఒకొక్కసారి మోహనరావు సంభాషణ "ఆఁ.. ఊఁ" వరకే వుండేది. ఆయన స్నానం నాష్తా రాత్రి భోజనం ఆ తర్వాత పడుకోవడం అన్నీ ఎక్కువ మాటల అవసరం లేకుండానే జరిగిపోయాయి. పిల్లలయితే మాట్లాడుతాడేమో కాస్త ప్రేమగా చూస్తాడేమో అనుకుంది సుగుణ. అయినా అతని ధోరణిలో ఏ మార్పు లేదు.

సుగుణ పట్నం వచ్చినప్పుడు అంతా కొత్త! వంటిల్లు గ్యాసు కుకర్లు బాత్‌రూమ్‌లు వ్యవహారమంతా చూసి ఆమె కంగారుపడింది. వాటన్నిటికీ అలవాటు పడేవరకు కొన్నాళ్లు పట్టింది. "పల్లెటూరు ముఖం!" అని మోహనరావు భార్యను చూసి నవ్వేవాడు.

సుగుణ తండ్రి కట్నంగా మోహనరావుకు బాగానే ముట్టజెప్పాడు. పట్నంలో బేగం పేటలో ఒక పెద్ద ఇల్లు కట్టించి ఇచ్చాడు. ఇల్లు సుగుణదే అయినా తన ఇల్లే - హక్కంతా తనదే అన్నట్లుగా వ్యవహరించేవాడు మోహనరావు. దానికితోడు సుగుణ ఆ కొత్త వాతావరణా నికి అలవాటు పడడానికి కొన్ని నెలలు పట్టింది. బేగంపేటలో ఇళ్ళన్నీ పెద్దపెద్ద మేడలు. ఇరుగు పొరుగు వ్యవహారం కూడా సుగుణకు లేదు. ఆమె ఒంటరిగానే వుండేది. మోహనరావు పనిమనిషిని పెట్టుకోమని అన్నాడు కాని "పొద్దంతా నేనేం చేస్తాను. నాకు పని అలవాటే!" అంది సుగుణ.

"సరే! గాని ఎవరువచ్చి తలుపు తట్టినా తలుపు గభాల్న తీయకు పిచ్చిముఖమా!" అని హెచ్చరించాడు మోహనరావు.

"పిచ్చి ముఖమా! - నాది పిచ్చిముఖంలా వుందా!" అని చాలాసేపు బాధపడింది సుగుణ. అయినా భర్తకెదురు తిరిగి మాట్లాడలేదామె.

"భర్త మాటకెదురు మాట్లాడ్డం తప్పుగదా!" అనుకుంది సుగుణ. వక్షస్థలం మీద పైట కొంగు చాటునున్న తాళిబొట్టును చేతిలోకి తీసుకొని కళ్ళకద్దుకుంది భయంతో.

"ఒంటరిగా నాకీ బంగ్లాలో భయమేస్తుందండి!" అంది సుగుణ ఓరోజు.

"అయితే ఓ పని చేస్తాను. ఇంటిముందు గడియవేసి తాళం వేస్తాను. నువ్వు ఇంట్లో ఏ భయంలేకుండా వుండొచ్చును. తాళం చూసి ఎవరూ రారు. నీకు భయం వుండదు" అన్నాడు మోహనరావు. ఆరోజు నుంచే భార్యనింట్లో పెట్టి తాళం వేసి వెళ్ళడం మొదలుపెట్టాడు మోహనరావు.

"నా భద్రత కోసమే ఆయనట్లా చేస్తున్నాడు! బాగానే వుంది!" అనుకుంది సుగుణ. తనక్కావల్సినవన్నీ ఇంట్లోనే వున్నాయి. ఇక బయటికెళ్ళే అవసరమేముంది అనుకుంది సుగుణ సంతృప్తిగా.

మోహనరావు తాళం వేసుకొని వెళ్ళిపోయింతర్వాత సుగుణ కాస్సేపు ఇంటిపని కాస్సేపు టీవి చూడడం కాసేపు కుట్టుతో కాలం గడుపుతుంది. పొద్దున్న వెళ్ళిన మోహనరావు

రాత్రి వస్తాడు. పగలు సుగుణ ఒక్కతె తిన్నా రాత్రి మోహనరావుకు కోసం ఆకలితో కూర్చొట్లు పడ్తూ ఎదురు చూస్తుంటుంది రోజు. మోహనరావు కారు రావడం ఇంటి ముందు తాళంతీసే చప్పుళ్ళు విని సుగుణ టీవి ముందు నుంచి లేచి వంటింట్లోకి వెళ్ళి కూరలవీ వేడి చేస్తుంది.

మోహనరావు సుగుణను టీవీ ముందు చూసాడంటే "ఇరవైనాలుగ్గంటలు టీవీ తప్ప మరో పనిలేదా?" అని కోప్పడ్తాడు.

మోహనరావుకు సుగుణ మీద కోపం చిరాకు చూపించడానికి ఏ చిన్న కారణమైనా చాలు. భోజనం చేస్తూ దానిలో ఉప్పులేదు. దీనిలో కారం లేదు. దానిలో కారం ఎక్కువైంది. దీనిలో ఉప్పు ఎక్కువైంది. అంటాడు చిరాగ్గా. ఒక్కొకసారి గ్లాసు నేలకేసి కొడ్తాడు. ఒక్కొసారి కంచం దూరం విసిరేస్తాడు. "ఎందుకింత పసుపు వేస్తావు?" అన్నాడో రోజు మోహనరావు కోపంగా.

"పసుపు ఆరోగ్యానికి మంచిదంటారు గదా!" అంది సుగుణ మెల్లగా. "అసలు అంత పసుపు వేయలేదే నేను" అని మనస్సులోనే అనుకుంది.

"మాటలు నేర్చావు! ఆరోగ్యానికి మంచిదని కుమ్మరించుకుంటారా! అయినా ఆరోగ్యానికి మంచిదని నీకెవరు చెప్పారు. నీ ముఖం ఏ టీవీలోనో రేడియోలోనో విని వుంటావు. అంతేనా! ఆ విధంగా విని వంటలు చేయొద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు! అయినా నువ్వెందుకు వింటావు! మొండివి!" అన్నాడు కోపంగా మోహనరావు.

సుగుణ మళ్ళా ఏం మాట్లాడకుండా భోంచేసింది. అన్నీ సర్ది పడగ్గదిలోకి వెళ్లింది. అప్పటికే మోహనరావు చాలా చిరాగ్గా ఏదో మ్యాగజైను తిరగేస్తున్నాడు. సుగుణ వెళ్ళగానే - "ఏదీ ఇటురా! ఇంతసేపు ఏం పనులు! ముసల్దానిలా పనులే తీరవు నీకు! ఇటురా!" అన్నాడు అసహనంగా. సుగుణను పేరుపెట్టి ఎప్పుడు పిలవడు మోహనరావు.

"ఏమే వున్నావా? ఏది ఇటురా!" ఇట్లా రకరకాలుగా సంబోధిస్తుంటాడు.

ఇక సుగుణ భర్తను పేరుపెట్టి పిలిస్తే భర్తకు ఆయుష్షు నష్టమని పెద్దలు చెప్పగా వింది. తన తల్లిగాని నాయనమ్మ అమ్మమ్మలు గాని భర్తలనెప్పుడూ పేరుతో పిలవడం గాని భర్త పేరుపెట్టి ముచ్చట చెప్పడంగాని చేయలేదు. కాబట్టి ఆమె భర్తను పేరుపెట్టి పిలిచే ప్రశ్నే ఉదయించలేదు ఆమె మనస్సులో. అదేవిధంగా తన తండ్రిగాని తాతలు గాని తమ భార్యను "ఏమే! వున్నావే?" అని పిలవగానే చూసింది. కాబట్టి మోహనరావు తనను పేరుపెట్టి పిలవకపోవడం మామూలుగానే కనిపించింది ఆమెకు.

సుగుణకు నలుగురు పిల్లలు పుట్టారు. ఇద్దరాడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. వాళ్ళ పెంపకాల్లో చదువులో నిర్ణయాలన్నీ మోహనరావువే. ఆడపిల్లలు పై చదువులు చదువుతాము అన్నా వినకుండా

"మీరు చదివితే మీకన్నా ఎక్కువ చదివినవాడ్ని తేవాలి! కట్నం కానుకలిచ్చుకోవాలి పైగా చదివిన డిగ్రీ చదువులు చాలు!" అన్నాడు మోహనరావు.

మగపిల్లల్ని మోహనరావు బాగానే చదివించాడు.

"వాళ్ళు సంపాదించాల్సినవాళ్ళు కుటుంబాన్ని పోషించాల్సిన వాళ్ళు! మరి!" అన్నాడు మోహనరావు.

"ఆడపిల్లల్ని అదుపులో పెట్టి పెంచాలి. అట్లా గాలికొదిలేసి వాళ్ళను స్నేహితులని సినిమాలని షికార్లని పంపవద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు! అయినా నీది మట్టిబుర్ర! నీకేం చెప్పినా లాభం లేదు. ఎందుకట్లా చెప్తున్నానో నీకర్థం కాదు" అన్నాడోరోజు మోహనరావు ఇద్దరాడపిల్లలు కాలేజి తరఫున స్నేహితులతో ఎక్స్‌కర్షన్ వెళ్ళారని తెలిసి.

"ఎందుకండి కోపం! వాళ్ళు స్నేహితుల్తో వెళ్ళారు గదా! వాళ్ళ కాలేజి లెక్చరర్లు కూడా వెంట వున్నారు గదా!" అంది సుగుణ మోహనరావు కోపం చూసి అరుపులు విని.

"ఆడపిల్లలకు బయట ఎంత ప్రమాదాలున్నాయో నీకేమైన తెలుసా?" మోహనరావు కోపంతో పెద్దగా అరిచాడు.

"ఎందుకండి అంత భయం. ఈ కాలంలో ఆడపిల్లలు ఎంత స్వేచ్ఛగా వుంటున్నారు. చదువుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. విదేశాలకు ఒంటరిగా వెళ్తున్నారు"- అంది సుగుణ.

"ఓహో బయటి ప్రపంచం నీకు బాగానే తెలుస్తున్నది! ఆడపిల్లలను అదుపులో పెట్టి పెంచాలి! ఏమన్నా అయితే అప్పుడు చేతులు కాలాక ఆకులు పట్టుకొని లాభ ముండదు. తెల్సిందా?" అన్నాడు మోహనరావు కోపంగా.

భర్త లేనిపోని భయానికి సుగుణ మనస్సులోనే చిరాకుపడి ఊరుకుంది.

"ఈ భయంతోనే తన తండ్రి తనను వంటింటి కుందేలును చేసాడు. వంశ గౌరవ మంటూ తనకో గుర్తింపు నియ్యలేదు. ఇప్పుడు మోహనరావు అదే చేస్తున్నా తను నిస్సహాయంగా ఏం చేయలేక పోతున్నది!" అనుకుంది సుగుణ బాధగా.

"మేమిప్పుడే పెళ్ళి చేసుకోం. ఇంకా చదువుకుంటాం!" అని అంటున్నా వినకుండా మోహనరావు కూతుళ్ళ పెళ్ళిళ్ళు వాళ్ళ డిగ్రీ చదువులయిపోగానే చేసేసాడు.

సుగుణ కొడుకులు ఇద్దరూ చదివి డాక్టర్లయ్యారు. వాళ్ళ పెళ్ళిళ్ళు ఘనంగానే జరిగాయి. చదువుకున్న కోడళ్ళను కాక బాగా కట్నం కానుకలిచ్చే కోడళ్ళను తెచ్చాడు మోహనరావు.

కొడుకుల పెళ్ళిళ్ళయ్యాక చిన్నవయస్సులోనే యాభై రెండేళ్ళకే మోహనరావు గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు.

తండ్రి చనిపోయిం తర్వాత కొడుకులిద్దరు వేరేవేరేగా వుంటున్నారు. సుగుణ పేర

వున్న బంగ్లాను మోహనరావు వుండగానే అమ్మేసి ఆ డబ్బుతో కొడుకులకు జూబ్లీ హిల్స్‌లో చెరో బంగ్లా కొన్నాడు. తండ్రి చనిపోయిం తర్వాత వాళ్ళు ఆ బంగ్లాల్లోనే వుంటున్నారు.

ఇక సుగుణకు వుండడానికి ఇల్లు లేకుండా పోయింది.

"అమ్మా! చెరో ఆర్నెల్లు మా దగ్గర వుండు" అన్నారు కొడుకులు.

సుగుణ చేసేదేం లేక పెద్దకొడుకు భూపతిరావు దగ్గర ఆర్నెల్లు, చిన్నకొడుకు హరనాథ రావు దగ్గర ఆర్నెల్లు వుంటున్నది. తల్లి భారాన్ని చెరిసగం పంచుకోవాలని కొడుకులా విధంగా నియమం చేసుకున్నారు. ఆర్నెల్లకోసారి అటు నుంచి ఇటు ఇటు నుంచి అటు మారడం సుగణకేం నచ్చలేదు. కొడుకుల కోడళ్ళ పెత్తనంలో సుగుణకు ఉక్కిరిబిక్కిరిగా వుంది!

"కానీ! తనకీ విధంగా చిన్ననాటి నుంచి ఎవరి పెత్తనంలో ఒకరి పెత్తనంలో వుండడం అలవాటే! కాని ఎందుకు? ఇప్పుడెందుకు నాకు ఉక్కిరిబిక్కిరిగా వుంది! ఎందుకు తనదంటూ ఒక తావు వుంటె ఎంత బాగుండును! అని అనిపిస్తున్నది!" అని సుగుణ తన మనస్సులోని కోరికలకు తనే ఆశ్చర్యపోయింది.

"ఈ ఆర్నెల్లకోసారి తిరగడం నాకు నచ్చడం లేదు బాబూ!" అంది సుగుణ ఆలోచించి ఆలోచించి ధైర్యం చేసి పెద్దకొడుకు భూపతిరావుతో.

"తిరగడం ఏంటమ్మా! నీ భారాన్ని మేం చెరిసగం సమానంగా పంచుకోవాలని ఆ విధంగా అనుకున్నాం! అందులో తప్పేముంది!" కోపంగా అడిగాడు భూపతిరావు తల్లి సుగుణను.

"భారం" నవ్వుకుంది సుగుణ.

"భూపతీ! నేను వేరే వుంటాను. నాకెక్కడైనా రెండు గదులు అద్దెకు చూడు!" అంది సుగుణ చిట్టచివరకు ధైర్యం చేసి.

"అమ్మా! నీకేం తెలుసని! ఆ విధంగా మాట్లాడుతున్నావు. నువ్వలా చేస్తే వంశగౌరవం ఏమౌతుందో ఆలోచించావా?" కోపంగా అన్నాడు భూపతిరావు.

"ఈ విషయం విన్న చిన్నకొడుకు హరనాథరావు "అమ్మా! నీకేమైన బుద్ధి వుందా? అట్లా వేరే వుంటె నీకెవరు చేస్తారు! అయినా లోకమేమనుకుంటుంది ఆలోచించావా? అయినా ఆలోచించడం నీకెప్పుడు తెలుసని?" వ్యంగ్యంగా పెదవి విరిచాడు హరనాథరావు.

"ఇద్దరు కొడుకులున్నారు. తల్లిని తరిమేసారు!" అనుకుంటారు కొడుకులు బద్నాం అవుతారనైనా నీకు చింత లేదా ఏంది?" అడిగాడు కోపంగా భూపతిరావు. తన తండ్రి ఇలానే తనతో కోపంగా అసహనంగా మాట్లాడేవాడు. తన భర్త ఇట్లానే కోపంగా నిర్దయగా మాట్లాడే వాడు. ఇప్పుడు! - ఇప్పుడు కొడుకులూ అదే విధంగా కోపంగా నిర్దయగా అసహనంగా మాట్లాడుతున్నారు. వాళ్ళ వైపు సుగుణ కనురెప్ప వేయకుండా చూసింది.

"లోకమేమనుకుంటుందని నేను లెక్క చేయను!" అంది సుగుణ మొండితనంతో కూడిన గొంతుతో.

"అంటే మేము బద్నాం పాలయినా నీకు లెక్కలేదన్న మాట! అంతేనా?" అన్నాడు హరనాథరావు. సుగుణ నోరు విప్పి ఏదో అనబోయింది. అంతే - "నువ్వు నోరు మూసుకో అమ్మా! నీకేం తెలుసని ! - బయటి ప్రపంచం గురించి!" అని భూపతిరావు గద్దించాడు.

సుగుణ ఏం మాట్లాడకుండా కన్నీళ్ళు కళ్ళల్లోనే కుక్కుకుంది. నిశ్శబ్దంగా అక్కడి నుంచి ఇంటి బయటికి నడిచింది. ఆమె ముఖం - ఎప్పుడూ భయం భయంగా వుండే ఆమె ముఖం ఏదో దృఢనిశ్చయంతో నిర్భయంగా మారింది.

* * *